# 8. వసంత

భానుమతి ఇంట్లో కొచ్చేసరికి ఇల్లంతా హడావిడిగ ఉన్నట్లు కనిపించింది. మెల్లగ జోళ్ళు బయట వరండాలో వదిలేసి. హాల్లోకి తొంగిచూసింది. అక్కడ భానుమతి నాన్నగారు రామనాథమే కాక మరి కొంతమందీ కూర్చొని ఉన్నారు. భానుమతికి అంతా అర్థమై పోయింది.

వసంత పెళ్లిచూపుల తతంగం. పెళ్లి చూపులంటే పెళ్లి చూపులు కావవి. పెళ్లిచూపులు జరిగి చాలాకాలమే అయింది. ఇప్పుడు జరుగుతున్నది ఆ తర్వాత తంతు అయివుండాలి.

భానుమతి కెందుకో భయంవేసింది. వసంతకు పెళ్ళయిపోతే .. అయిపోతే ఏముంది ఇక ? మిగిలిపోయేది తనొక్కతే ! ఇక మీదట ఎక్కడికి వెళ్ళాలన్నా తన కుండే తోడంతా తన వంటరి తనమే! ఆ సంగతంతా తల్చుకుంటే భానుమతికి భయంతో పాటుగ తనంటే తనకే జాలి కలిగింది.

పెరట్లోంచి వంటిల్లు చేరింది. వసు అక్కయ్య ఏడుస్తోంది అక్కడ. భానుమతికీ ఏడుపొచ్చింది ఆ క్షణంలో.

అమ్మ భానుమతిని చూడగానే బావురుమంది—"భానూ... !"

భానుమతికి అర్థంకాలేదు – "అమ్మా ఏమయిందే ?...."

ఈసారి వసంతకూడా బావురుమంది.

" ఏమయిందమ్మా ?...."

చాపు తర్వాత నిశ్శబ్దం అలముకొంది. తుఫానుకు ముందు ప్రశాంతత అంటే ఇదేనేమో అనిపించింది భానుమతికి. అమ్మా అక్కయ్యల ఏడుపు వెక్కిళ్ళ మధ్య భానుమతికి ఎంతో అర్థం కనిపించింది.

"ఏమయిందే అమ్మా ?...."

పాడినదే పాట. అడిగినదే ప్రశ్న. అయితేనేం. జవాబు రాలేదు భానుమతికి.

పోరా

మళ్లీ అడిగింది. మెల్లగ అంది భానుమతి అమ్మ "మూర్తి హాస్పిటల్లో ఉన్నాడుటే !"

" ఎందుకు ? ఏమయిందిట ?"

" ఆక్సిడెంట్... "

మూర్తి .. భానుమతికి వళ్ళంతా ఝల్లుమంది. మూర్తి-తనకేమిటి ఎవరికీ ఏమీ కాడు, కానీ ఎంతో కావాల్సి వుంది. ఆ రోజుకోసం అందరూ ఎదురు చూస్తుంటే యిదేమిటి, యిలా జరిగింది ?.... తనకే యింత యిదిగ ఉంటే ఇక-పసు అక్కయ్య సంగతి సరేసరి....

అక్కయ్యకు అతను కావాల్సిన భర్త. ఇంతకూ ...

భానుమతి కోసారి భయం కలిగింది. పెళ్ళిచూపులు జరిగాయి. తాంబూలాలు పుచుకొన్నారు ముహూర్తం కూడా ఇంక ఖచ్చితంగా పదిహేను రోజులు అయినా లేదు, యిపుడు యిలా జరిగితే అయినా తను సరిగ విందో లేదో ? కానీ అమ్మ అక్కయ్యల ఏడుపులు చెవుల్లో వినవస్తోంటే తను వింటున్నది నిజమే. ఇందులో కలగంటున్నది కానీ, పీడకల కానీ ఏదీ లేదనిపించింది భానుమతికి. కానీ మనసెందుకో కీడు శంకించటానికి అంగీకరించటంలేదు. మరోసారి అడుగుదామంటే అడగబుద్ధి కావటం లేదు. దుర్వార్త మాటిమాటికీ వినాలనే ధ్యాస భానుమతికి లేకుండా పోయింది. అందుకే మౌనంగ ఉండిపోయింది.

ఇంట్లోకి రామనాథం వచ్చారు ఆయన యింట్లోకి రాగానే వసంత బావురుమంది.

"ఊ, ఊరోక్కోండి, ఊరోక్కోండి, ఏం చేయగలం గనుక ?.... అయినా యింతలోనే ఏం జరిగిపోయిందనీ ?"

నిజమే, ఏం చేయగలం గనుక ? బ్రతికినన్నాళ్లూ ఎందుకు బ్రతికామో తెలీక, చస్తే ఎందుకు చచ్చామో తెలీక, ఈ బతికిన ఇన్నాళ్ళలో ఎలా బతికి ఎవర్ని ఎలా ఉద్ధరించామో, చచ్చాక ఎంత వెనకేసి చస్తున్నామో చూసుకోవటమే తప్ప మరెందుకూ పనికిరాం మనం ? నిజమే ఏం చేయగలం గనుక ?

"పారూ... ఊరోక్కోమంటే ఊరోక్కోవాలి ! ఎంతసేపు ఏడిస్తే ఏం లాభం ?" అని అమ్మను ఊరడిస్తూ "భానూ, కొంచెం టీ పెట్టు తల్లీ !" అన్నారు.

భానుమతి కుంపటి అంటించింది. బొగ్గులు ఒకటొకటిగ అంటుకొంటోంటే ఆ నిప్పురవ్వలు ఒకటొకటిగ తమ జీవితాలమీద పడుతున్నట్లుగ అనిపించింది భానుమతికి.

మొదట్లో తాతయ్య మరణం, పెద్దతనం, హుందాతనం, పెద్ద తరహా తాతయ్యవల్ల యింటికి అంటివచ్చినట్లు అనిపించింది భానుమతికి. ఆ ఊళ్ళో తాతయ్య అంటే గొప్ప గౌరవం ఉండేది. అలాటి తాతయ్య ఉన్నట్లుండి నిద్రపోతూ మరణించటంతో, ప్రసాదం మామయ్య అమ్మనూ, నాన్ననూ కోర్టుకు లాగటం అంతా క్షణాలమీద జరిగిపోయింది. తాతయ్య పోయిన రెండేళ్లవరకూ కోర్టుల చుట్టూ తిరగటమే సరిపోయింది. ఆ తర్వాత కోర్టువారు కేసుకొట్టేశారు. అంటే, అయిపోయింది. తాతయ్య బతికుండగా ఉన్న ఆ పదిహేను ఎకరాలూ క్షణంలో కొట్టుకుపోయాయి.

సరే, ఆ తర్వాత ఇది - అక్కయ్య పెళ్ళికి నాన్నెంత అవస్థ పడ్డాడో తనకు తెలుసు, ఇంట్లోని ప్రతి వ్యక్తికీ తెలుసు. కానీ ఆ భగవంతుడికి మాత్రం తెలిసినట్లు లేదు. పెళ్ళి చూపులు, ప్రధానం, ముహూర్తం ఒకదానివెంట ఒకటి తరుముకొని వచ్చాయి-ఇంతలోనే ఇది.

నీళ్లు మరుగుతున్నాయి. భానుమతి ఉన్నట్లుండి తేరుకొంది. టీ కాచడం పూర్తిచేసి వీధిగదిలోకి కప్పులు తీసుకెళ్ళింది. వీధిగదిలో మూర్తి వాళ్ళ అన్నయ్య, మూర్తీవాళ్ళ నాన్నగారు, రామనాథం ఉన్నారు. మూడు కప్పులూ అక్కడ అందించి, వెనక్కి తిరిగింది భానుమతి.

"భానూ, అమ్మ, అక్కలకు కూడా టీయమ్మా !" రామనాథం అన్నాడు.

"అలాగే" తల ఊపి వచ్చేసింది భానుమతి.

అందరూ కాఫీలు తాగాక హాస్పిటల్‌కు కదిలారు. వసంత రాననే అంది ముందు. కానీ ఆతర్వాత అందరూ రమ్మంటే కదిలింది. హాస్పిటల్లోకొచ్చేసరికి, బెడ్‌మీద ప్లాస్టర్లతో, బాండేజీలతో ఉన్న ఆకారం దగ్గర ఆగారు.

ఆ ఆకారం పేరు మూర్తి.

అతను ఆ యింటికి కావాల్సిన అల్లుడు.

మూర్తివాళ్ళ నాన్నగారు ముందుగా కదిలారు. "అబ్బాయ్ మూర్తీ....?"

ఆ అబ్బాయి కళ్ళు తెరిచాడు. కళ్ళలో జీవం లేదు. ఆకళ్ళల్లో కళలేదు. ఆ కళ్ళు వెంటనే మూతలు పడిపోయాయి.

మళ్ళీ ఆయనే అన్నారు—"చూడన్నాయ్, వసంత వచ్చిందినీకోసం"

భానుమతికి ఆశ్చర్యం కలిగింది. ఆ మాటలకు మళ్ళీ కళ్ళు తెరిచిన మూర్తిని చూశాక-బలంగ దెబ్బలు తగిలాయి అతనికి, అతను

కోలుకోపోయినట్లయితే తాము కోలుకోవటం సంగతి కల్ల—అయినా వసంత పేరు వినగానే మూర్తి కళ్ళు తెరవటమే ఆశ్చర్యంగ వుంది.

మూర్తి నవ్వలేక నవ్వాడొకసారి. ఆ నవ్వు నెవరూ అందుకో లేక పోయారు.

అంతా పది నిమిషాలు అక్కడే గడిపి మరింతగ భారమైన హృద యంతో ఇంటికి తిరిగొచ్చారు. తిరిగొస్తోంటే చెప్పారు మూర్తినాన్నగారు ఆక్సిడెంట్ ఎలా జరిగిందో! భానుమతికి అదంతా వినబుద్ధి గాలేదు. ఎలా జరిగితేనేం, ఆక్సిడెంటే!!

ఇంటికొచ్చేశాక మొదలయింది అసలు కధఅంతా ఇంట్లో అందరూ కూర్చున్నాక నెమ్మదిగా అంది భానుమతి అమ్మ, భర్తతో—"ఏం చేద్దా మంటారు ఇప్పుడు?"—

రామనాథం తలెత్తుతూ అన్నాడు—"ఏం చేద్దామంటారు అంటే?"

"అంటే, నా ఊహ అబ్బాయి పరిస్థితి అలా ఉందికదండీ,మరి ముహూర్తం వేళకు...."

"ఛ నోర్మూసుకో, ఇప్పుడంటే ఇలా ఉంది కానీ, రెండు రోజు లలో తగ్గిపోదూ...." అన్నాడు రామనాథం.

భానుమతికి తలకొట్టేసుకొన్నంత పనీ అయింది ఎంతటి ఆత్మ వంచన ఇది!! నాన్నగారికి మాత్రం తెలీదూ ఇది చాలా సీరియస్ ఆక్సిడెంట్ అనీ, రెండుమూడు రోజుల్లో తగ్గేది కాదనీనూ అయినా ఏమిటో ఇది. ఎవర్ని వంచించటానికి ఈ ప్రయత్నం?

ఆ మాట అమ్మ అడగనే అడిగేసింది—"ఆ అబ్బాయ్ ఒళ్ళంతా కట్లతో ఉంటే రెండు రోజులలో తగ్గుతుందంటారేమిటీ?"

రామనాథానికి చిరాకొచ్చింది. "ఏడిశారులే! నాకు తెలుసు ఏమిటి తగ్గుతుందో తగ్గదో? ఒళ్ళంతా కట్లంటే, ఈ కుర్ర డాక్టర్లు గోరంతలు

కొండంతలుగ చేస్తారు. చిన్న కురుపై తేనే ఆపరేషన్ అనటం మనకు తెలీదా: ఏమిటి?"

వసంత చివాలున అంది, "అమ్మ అన్నది కరక్టే నాన్నా, ఆయన పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నమాటయితే నిజం!"

"నీకు తెలీదు తల్లీ! నాకు డాక్టరు చెప్పనే చెప్పారు. అబ్బాయి కేమీ ప్రమాదం లేనేలేదని!—"

"ప్రమాదం మాట అలా ఉంచు నాన్నా! అమ్మ అడిగేది పెళ్ళి మాట!"

"ఏముందమ్మా అందులో, అబ్బాయి కెలాగూ రెండు మూడు రోజులలోగా తగ్గిపోతుందిగా, పెళ్ళంటావ్ ఇంకో పదిహేనురోజులు ఉండనే ఉంది"

వసంత అడిగిన మాటలను నాన్న సరిగా అర్థంచేసుకొన్నట్లులేదు ఆ సంగతి అందరకూ తెలుసు కానీ ఎవరూ ఆ విషయాన్ని మాత్రం పట్టించుకోలేదు.

భానుమతికి మాత్రం వంతంవచ్చింది. ఒక వార్త మనిషి జీవితంతో ఆడుకోవడం బాగులేదనిపించింది. ఆ విషయమే వసంతకు చెప్పడం మంచిదనుకొంది.

ఆమర్నాడు హాస్పిటల్‌నుంచి ఒకవార్తవచ్చింది. మూర్తి వసంతను కలుసుకోదలుచుకున్నాడని, అభ్యంతరం లేకపోతే ఒంటరిగా సాయంత్రం హాస్పిటల్‌కు రమ్మని కోరాడతను. భానుమతిని కూడా రమ్మంది వసంత. మొదట బాగుంటుందా, బాగుండదా అని సంశయించి చివరికి భానుమతి కూడా కదిలింది.

సాయంత్రం నాలుగున్నర అయింది. హాస్పిటల్ గేటులోకి వెళ్ళే జనాభా త్వరత్వరగా నడుస్తు న్నారు. హాస్పిటల్ వాతావరణం అంతా

మందుల వాసనతో వెగటు వేస్తోంది. వేపచెట్ల మీదనుంచి వస్తున్న గాలిమాత్రం హాయిగ, ఆహ్లాదకరంగ ఉంది.

భానుమతి, వసంతలు వెళ్ళేసరికి మూర్తి నిద్రపోతున్నాడు. వీళ్ళ ఇద్దరి అలికిడికి నెమ్మదిగ కళ్ళు తెరిచాడు. పేలవంగా నవ్వాడు పలకరింపుగ.

ఆ కళ్ళల్లో చిలక ఏ క్షణంలోనైనా ఎగిరిపోవచ్చు ననిపించింది భానుమతికి.

'వచ్చారా, రారనుకున్నాను' అన్నాడతను వాళ్ళ ఇద్దరితోనూ 'కూర్చోండి' అన్నాడు అతను. భానుమతికి కూర్చోబుద్ధి గాలేదు. కూర్చుంటే బయటకు వెళ్ళటం కష్టం. అందుకే నెమ్మదిగా అంది— 'అక్కా, ఒక్కసారి బయటకు వెళ్ళొస్తానే!'

వసంత ఏమీ అనలేదు.

క్షణం నిలబడి బయటకు నడిచింది భానుమతి.

ఆస్పత్రి ఆవరణ అంతా కళకళలాడుతోంది. స్నేహితులకోసం. హితులకోసం, మిత్రులకోసం, ప్రాణాలకోసం హాస్పిటల్‌కు వచ్చిన వాళ్ళతో కళకళలాడుతోంది. అంతటి గోలలోనూ ఒక రకమైన స్తబ్దత అలముకున్నట్లే అనిపించింది. అటు తిరిగింది, ఇటు తిరిగింది. మెటర్నిటీ వార్డు, సర్జికల్ వార్డు, మెడికల్ వార్డు అంతా తిరిగింది. అంతా ఒకటే వాసన–ఫినాయిల్ వాసన.

గడియారం చూసుకొంది. అప్పటికే తనొచ్చి గంట దాటింది. నెమ్మదిగ మూర్తి ఉండే వార్డుకేసి నడిచింది భానుమతి.

వసంత అప్పటికే బయటకొచ్చి నిలబడింది. భానుమతి లోపలికి వెళ్ళి మూర్తితో వెళతామని చెప్పి, కదిలింది.

హాస్పిటల్ గేటు దాటాక అడిగింది వసంత - 'భానూ, ఏం జరిగిందని అడగవేం?'

'అది నేను అడగకూడదు. నువ్వే చెప్పాలి' అంది భానుమతి నవ్వుతూ.

'ఒక వేళ నేను చెప్పననుకో, అప్పుడు...'

'చెప్పకపోతేనేం అది నీ విషయం, నీ ఇష్టం. నీకు చెప్పాలని ఉంటే చెబుతావు. లేకపోతే లేదు. అంతే గదా! చెబితే వింటాను' అంది భానుమతి.

వసంత నవ్వింది - నువ్వొత్త ఇడియట్‌వే!'

'కాదనను, కానీ నీ చెల్లెల్ని కూడాను!' ఇద్దరూ నవ్వుకొన్నారు.

క్షణం ఆగి అంది వసంత. - 'ముహూర్తం సంగతి ఆలోచించమంటాడు అతను!'

భానుమతికి కనుబొమలు ముడిపడ్డాయి 'ఏం బెడ్‌మీద కూడా ముహూర్తం గొడవే కావాల్సి వచ్చిందా ఏం?'

'ఛ, అదికాదు భానూ!' నొచ్చుకుంటూ అంది వసంత. ముహూర్తం పదిహేను రోజుల్లోనేగా ఉంది. పెళ్ళి విషయం "ఏం ఆలోచించావు అని అడిగాడు!'

'పెళ్ళి విషయం నువ్వు ఆలోచించేదేమిటసలు? నీ ఇష్టం ఇంట్లో చెల్లుతుంది గనుకనా?'

'ఇష్టాఇష్టాలు చెల్లుతాయో లేదో గానీ అతనన్నది అది. ముఖ్యంగ ఇంకో విషయం చెప్పటానికే పిలిచాడుట'

'అదేమిటి?'

'రేవతనికి ఆపరేషన్ చేస్తారుట. ప్రాణానికి భయంలేదుగానీ, కుడికాలు మాత్రం ఉండదుట'

భానుమతి ఉలికి పడింది. అంటే .. మూర్తి అవిటివాడు . నో-నో-ఇట్ కాంట్ బీ....

'అతని కెవరు చెప్పారుట ?'

'నీమొహంలా ఉంది ప్రశ్న ! అతని కెవరు చెబుతారు ? డాక్టర్లు కుడికాలు బాగా దెబ్బతినేసింది, తీసేస్తాం అని చెప్పారుట. వైవాహిక జీవితానికిమాత్రం అభ్యంతరం ఉండదన్నారుట.'

'నీతో చెప్పాల్సిన అవశ్యకత ఏమిటిట?'

'అదేమిటే, రేపతన్ని చేసుకోబోయేది నేనేనా? లేకపోతే నువ్వా? నాతో చెప్పక పోతే, ఇంకెవరితో చెబుతాడు ?'

'అంటే చేసుకుందామనే నీ ఉద్దేశ్యం !' భానుమతి చాల సీరియస్‌గ అడిగింది.

'అతనూ అదే అన్నాడు - అవిటి వాడినేం చేసుకొంటావ్' అని!

'నువ్వేమనుకొంటున్నావ్?'

'నేనేమీ అనుకోవటంలేదు. నా తలంతా దిమ్మెక్కి పోయింది. ఏదీ ఆలోచించ గలిగే స్థితికాదు నాది' అంది వసంత నెమ్మదిగ.

భానుమతి అక్కకేసి ఒకసారి చూసి అంది. అక్కా నీకొకటి చెబుతా విను. ప్రపంచంలో నాకు నీకంటే ఇష్టమైన వారు లేరన్న సంగతి నీకు బాగా తెలుసు. అంటే నీవు ఏపనిచేసినా హర్షిస్తా గానీ, ఆత్మవంచన ఉంది చూశావ్, ఆ పని చేస్తే మాత్రం నేను అసహ్యించుకొనేంతగ ఎవరూ అసహ్యించుకోరన్నది మర్చిపోకు !

వసంత తెల్లబోయింది 'ఆత్మవంచన ఏమిటే ఇందులో?'

'ఇంకేపేరు పెడతావ్ దీనికి? పెళ్ళి జరుగుతున్నది నీకు ఇంకో వారం రోజుల్లో. అయినా ఆ విషయం నమ్మటం లేదంటే నమ్మటానికి నేనేం చిన్నపిల్లననుటే! పెళ్ళి ఇంకో పది రోజుల్లో ఉంటే ఏ ఆడదీ

ఇంకో విషయం గురించి ఆలోచించదన్న సంగతి నాకు చెప్పనక్కర్లేదు. ఆలోచించటం లేదనటం ఆత్మవంచన కాకపోతే మరేమిటంటావ్? పోనీలే, ఆలోచించలేదనే అనుకో, ఆలోచించే ఊహైనా ఉందా లేకపోతే గంగి గోవులాగ... '

వసంత ఏమీ అనలేదు.

'నేనేదో నీకు లెక్చరు ఇస్తున్నాననుకోకు. కానీ నీ పెళ్ళంటే నాకెంత సరదా, సంతోషమూ కలిగాయో నీకు చెప్పనక్కర్లేదు. కానీ ఈ క్షణంలో ఎంత బాధపడుతున్నానో తెలుసా? పెళ్ళనేది జీవితప్రశ్న. అలాటి విషయంలో బాగా ఆలోచించి తీరాలనేది మర్చిపోకు. ఇంకో సంగతి. సరిగా చెబుతా విను—మనమేం దరిద్రులం కాము. అందం విషయంలోనూ అంతే, అప్సరసలం కాకపోయినా అసహ్యంగ ఉండము. అలాటి వాణ్ని చేసుకోవాల్సిన అగత్యం ఉందనుకోను.'

భానుమతి చెప్పటం ఆపి ఒక్కసారి అక్కముఖంలోకి చూసింది. అక్క ముఖంలో తను కోరుకొన్నట్లు రంగులు మారటం గమనించి సంతృప్తి పడింది.

'నే నిలా అన్నానని ఏమీ అనుకోకు. నువ్వు అతన్ని చేసుకోవాలనే నిర్ణయం ఉంటే నేనేమీ అనలేను. కానీ ఆలోచించాలన్నావ్ గాబట్టి చెబుతున్నాను—పెళ్ళి సెటిలయినంత మాత్రాన చేసుకొని తీరాలనే రూలేమీ లేదు. అంతా ఇష్టాయిష్టాలమీద ఉంటుంది. ముఖ్యంగా నీ ఇష్టంమీద... '

ఇల్లు దగ్గరకొస్తోంటే అంది భానుమతి—'వసూ, నేనన్నది గుర్తుంచుకో! అతన్ని చేసుకోనూ అంటే ఇంట్లో నీతల తీసెయ్యగల వాళ్ళెవరూ లేరు'

ఇద్దరూ ఇంట్లోకొచ్చేశారు.

వసంత ముఖంలోని ప్రశాంతతను చూస్తూ, భానుమతి ఆ ప్రశాంతత వెనుక ఉన్న హోరును చదవగలిగింది.

*  *  *  *  *

ఆరోజు సాయంత్రం చీకటిపడింది—భోజనాలు చేస్తుండగా అంది వసంత, 'నాన్నా, నేనూ భాను, మధ్యాహ్నం హాస్పిటల్‌కు వెళ్ళాం.'

'తెలుసుగదమ్మా నాకు !'

'అదే నానా, ఆయనకెలా ఉందని అయినా అడగలేదేం మరి?'

రామనాథం నవ్వాడు—'ఓ అదా, అతనికేం? రెండుమూడు రోజుల్లో ఇంటికొస్తారు మహరాజులాగ !'

వసంత నెమ్మదిగ 'ఒకప్పుడు నేనూ అదే అనుకున్నాను. కానీ ఈ వేళ ఆయన చెప్పారు, ఆయన కుడికాలు తీసేస్తారుట !

'ఓ అదా! నాకూ ఇప్పుడే తెలిసింది'

భానుమతికి చిర్రెత్తుకొచ్చింది. 'అదేమిటి నాన్నా! అంత తేలికగా 'ఓ అదా?' అనేస్తున్నారు. ఆ సంగతి వసుకైనా చెప్పాల్సింది మీరు'

'చెప్పేవాడినే కానీ, మీరే హాస్పిటల్‌కు వెళ్ళారుగదా, తెలుస్తుంది అనుకున్నాను. అనుకున్నట్లుగనే జరిగింది... '

'కానీ నాన్నా, ఒక సంగతి. మీరు అనుకోనిది చెబుతాన్నాన్నా—నేనతన్ని పెళ్ళి చేసుకోను !'

భానుమతికి సంతోషం కలిగింది.

'అదేమిటమ్మా భానూ! అక్క అలా అంటోంది?'

వసంతే అంది వెంటనే, 'ఏముందమ్మా నేనన్నది? ఈ పెళ్ళి నాకిష్టం లేదు. ఇష్టంలేదేమిటి మళ్ళీ నేను చేసుకోను' వసంత కంఠంలో ఆ ధృఢ నిశ్చయం స్పష్టంగ తెలుస్తోంది. భానుమతికి సంతోషంగ ఉంది—అక్క ధైర్యం పుంజుకున్నందుకు.

వసంత అన్నం దగ్గరనుంచిలేచిపోతూ అంది, 'నాన్నా మీ కన్న కూతుర్ని నేను. ఏ విషయంలోనూ స్వాతంత్ర్యాన్ని కానీ, అధికారం

కానీ కోదుకోనిదాన్ని, కానీ ఈ విషయంలో మాత్రం నన్ను కాదనకండి నా సంసారం అవిటి సంసారం కాకూడదు—'

భానుమతికి ఆకాశం అందినంత ఆనందం కలిగింది.

మూడు రోజుల తర్వాత—

భానుమతి కాలేజీనుంచి యింటికొచ్చేసరికి వసంత అడిగింది - 'నా పెళ్లి కేమిస్తావే నువ్వు ?'

'నీ పెళ్లేమిటి నాన్సెన్స్ ?—'

'నాన్సెన్స్ కాదు భానూ, నా పెళ్ళి మూర్తితో, అనుకొన్నట్లు గనే జరుగుతోంది-'

'చేసుకోనన్నావు గదే ?-'

'అది కుర్రతనం - చేసుకోనంటే కుదురుతుందేమిటే ?-'

'అక్కా ! నీ పెళ్లి నీ యిష్టం లేకుండా ఎవడే జరిపించ గలి గేది ?-' వసంతకు కన్నీళ్లొచ్చాయి. ఆ నీరు ఒకే చుక్కగ కంటి కొల కుల నుంచి నెమ్మదిగా జారి బుగ్గలమీద నిలిచిపోయింది.

'చెప్పక్కా, ప్లీజ్-'

"ఏం చెప్పనే భానూ ! నీకే తెలుస్తుంది. తెలీకపోతే, నా పెళ్లి రోజున అడుగు, తప్పకుండా చెబుతాను-" అంది వసంత.

భానుమతికి కోపం వచ్చింది. దుఃఖం వచ్చింది అక్కయ్య చేత నిజాన్ని చెప్పించు కోలేని తన దౌర్భాగ్యాన్ని తలచుకొని భోరున ఏడవా లనిపించింది భానుమతికి.

* * *

పెళ్ళి అయిపోయింది -

వసంతను కౌగిలిలో పొదుపుకొని ఏడుపును దిగమింగుకుంటూ అంది అమ్మ - "నన్ను క్షమించు తల్లీ ! నీ జీవితాన్ని బలి తీసు

కున్నాం !! నాకు తెలుసు, నీకీ పెళ్ళి ఇష్టం లేదని – కానీ ఏం చేస్తాం ! పెళ్లికి మిగిలిన అప్పు లున్నాయి. నీ తర్వాత భానుమతి వుంది – ఇంకా ఏం చెప్పను ?–"

కన్నతల్లి కంటి నీరు చూడలేకపోయింది వసంత.

నెమ్మదిగ అంది అమ్మతో – "అదేవిటమ్మా, అలా అంటావ్ ? పెళ్ళిలో కన్నీళ్లేమిటి ? – అయినా ప్రదానం జరిగేక ప్రమాదం జరిగింది. నా జాతకం యిలా వుంటే మీరేం చేస్తారు ? ఈ పెళ్ళి తప్పిపోతే ఇంకె వరే నన్ను చేసుకొనేది ? భానుకోసం కాదమ్మా, నాకోసమె అనుకొన్నా ఈ పెళ్లిని ! ఈ పెళ్ళి నాదేనమ్మా నాదే ! –"

ఆ మాటలకు భానుమతికి అంతా తెలిసిపోయింది – ఆడదై పుట్టటం అంత శాపం ఈ పుణ్యభూమిలో అదేగానీ ఇంకేమీలేదు –

భానుమతి కంట్లో నీరు కిందకు రానని మొరాయించింది.

అక్క పెళ్లి తప్పించటానికి తాను చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థం అయిపోతే, అక్క పెళ్ళికి తను అడ్డయిపోతే – ఎం చేయాలో తెలియక మనసులో ఏడ్చింది భానుమతి.

ఆ ఏడుపు వసంతకు వినిపిస్తోంది.

కానీ –

వసంత వినకుండా వుండాలని వ్యర్థంగ ప్రయత్నిస్తోంది.

భానుమతికి అక్కయ్య చేసిన త్యాగం అర్థం లేనిదిగా కనిపించ సాగింది

[ జ్యోత్స్న – అక్టోబర్ '72 ]